# దూళ్ళ బుల్లియ్య

**దూళ్ళవ్యాపారం చేసే నల్లమిల్లి బులిరెడ్డిని దూళ్ళ బుల్లియ్య అని పిలవడం అలవాటయింది.**

**మాచవరం, సోమేశ్వరం, చెల్లూరు. వెదురుపాక నదురబాద లాంటి గ్రామాలన్నీ కల తిరిగి పశువుల్ని కొనుగోలు చేసి ద్రాక్షరామం, ద్వారపూడి, ఆలమూరు పిఠాపురం సంతల్లో మంచి లాభాలకి అమ్ముతాడు బుల్లియ్య.**

**బుల్లియ్య ఇల్లు, చింతాలమ్మగుడి వెనకున్న ఊటలంక వీధిలో ఉంది. వాళ్లక్క కూతురు అమ్మాయి (అసలు పేరు ఆదిలక్ష్మి)ని చేసుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు.**

ఊళ్ళో చిన్నం వాళ్ళ అరుగుమీద మిషను కుట్టే త్యాగరాజుగాడూ ఉల్లిపాయల మేష్టారి కొడుకు పంతులూ, ఆడారి సత్తిరాజూ, పసగాడి సూరన్నగారబ్బాయి పాండురంగం మాచవరం నించెళ్ళి రాజమండ్రి వెళ్ళిపోయి అక్కడ్నించి దూళ్ళ వ్యాపారం చేస్తున్న పులగం పెద్ద మంచి ఫ్రెండ్సు బుల్లియ్యకి.

వ్యాపారం కాస్త పై ఎత్తులో చేసే పెద్ద తక్కిన పన్లన్నీకూడా పై ఎత్తులోనే చేసేడు.

సాటి దూళ్ళ వ్యాపారస్తులందరికీ ఆ ఏడాది కార్తీకమాసం వెన్నెల్లో పెద్ద పార్టీ ఏర్పాటు చేసేడు. అదికూడా గోదారి మధ్య ఫంట్‌లో.

అందరితో పాటు బుల్లియ్యకి కూడా పిలుపొస్తే వెళ్ళేడు రాజమండ్రి.

దవిళేశ్వరం పి.డబ్ల్యు.డి వాళ్ళ దగ్గర్నుంచి ఒక ఫంటు మెండా సత్యనారాయణగారి దగ్గర్నుంచి ఒక ఫంటూ అద్దెకి తెచ్చి వాటిని లాగడానికి గూటాలలో ఉండే మూర్తిగారి లాంచీనీ, బోళ్ళ వీరాస్వామిగారీ లాంచీనీ పిలిపించేడు. అజంతా హోటల్లో పని చేసి మానేసిన వంటోడు సత్యన్నారాయణతో రకరకాల వంటలు చెయ్యమని పురమాయించేడు. ఆ వంటలుకూడా లాంచీలు గోదాట్లో వెళ్తున్నప్పుడు మట్టుకే చెయ్యాలి. ఆ పొగలు కక్కుతా ఉండగా అందరికీ వడ్డించాలి. ఆ తర్వాత జాంపేటలో ఉండే జిలానీ లైటింగు, మైకుసెట్టు అలా

అన్ని ఏర్పాట్లతో పాటు ప్రత్యేకమైన ఏర్పాటేంటంటే మురమండనించి భోగం మేళం ఒక ఫంట్ మీద, చక్రవర్తీ ఉదయకుమార్ రికార్డింగ్ డేన్సు ఇంకో ఫంటు మీద.

వెన్నెల్లో రెండు ఫంటుల్నీ రెండు సీరియల్ బల్బులతో అలంకారం చేసిన రెండు లాంచీలు లాగుతుంటే అందులో స్వర్గానికి ప్రయాణం చేస్తున్నట్టుంది.


మేళంలో అమృతం అనే అమ్మాయి చాలా నచ్చింది బుల్లియ్యకి. లాంచీలు కుమారదేవం దాటుతుండగా రాత్రి రెండయింది. పులగం పెద్ద ద్వారా అమృతాన్ని పరిచయం చేసుకున్నాడు బుల్లియ్య. అప్పటికే దోసకాయలపల్లి చౌదరిగారు మాటాడుకుని కూడా తీసుకుపోతున్న అమృతాన్ని పెద్ద ద్వారా మాటాడించి ఆపిన బుల్లియ్య తన కూడా తీసుకెళ్ళిపోయేడు.

అమృతం తనతో నిజంగా అమృతం తాగించి స్వర్గానికి తీసుకెళ్ళింది ఆరాత్రి. అలాంటి రుచి అలాంటి సందడి తనెరగడు. ఆ కార్యం జరిగేటప్పుడు ఎక్కడికో వెళ్ళిపోయింది అమృతం అంతసేపూ ఏవండీ అన్న మనిషి ''ఏరా... ఏంట్రా'' అంటా కేకలెయ్యడం మొదలెట్టింది. ఇంకా ఏవేవో మూల్గులు గునవడాలు ''ఏంటే...ఎంత బాగుందే ఇది'' అంటా మాటాడిన మాటలూ అందమైన బూతులకి అన్నీ మరిచిపోయిన బుల్లియ్య ''ఈ అమృతాన్ని నా సొంతం చేసుకోవాలి'' అనేసి అర్జంటుగా నిర్ణయించుకున్నాడు.

ఒక పగటిపూట మురమండెళ్ళి ''నువ్వు నాకు మట్టుకే సొంతమవ్వాలి ఎలాగ?'' అన్నాడు.

''మా పిల్ల వయసులో ఉంది. అన్నీ వదులుకుని రావాలంటే మీ పసలపూడి పొలం అయిదెకరాలు రాయండి'' అంది అమృతం ఆళ్ళమ్మ.


''సరే'' అని వెంటనే రాసేసి అమృతం మకాం రామచంద్రపురం తోటవారి వీధిలోకి మార్పించేడు. సంసారానికి కావాల్సిన సామాన్లన్నీ కొనిపెట్టిన బుల్లియ్య ఆ రాత్రి ''ఈ జన్మకి నా దగ్గర తప్ప ఇంకో మగోడి పక్కలో పడుకోనని ఒట్టెయ్యి'' అన్నాడు అమృతంతో.



వేసింది.

బుల్లియ్యపెళ్ళాం అవమ్మాయి దగ్గరకెళ్ళిన సత్తిసూర్నాణరెడ్డిగారిచిట్టి, అవ్మృతం బుల్లియ్యలవ్స్టోరీ చెప్పేసేడు.

ఒకరాత్రి అమృతం ఇంటికాడ్నించి బయల్దేరి వచ్చిన బుల్లియ్యతో ''దానింట్లో మంచం నీ సొంతం అనుకుంటున్నావేంటి నువ్వొచ్చేసేకా ఆ మంచం మీద ఎంతమంది ఎక్కి దిగురో నీకేం తెల్సు?'' అనేటప్పటికి చురుక్కుమని అంటుకుందామాట. ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు. ఆవేళ ఫంట్ మీద అమృతం కోసం ఎంతమంది ఎగబడ్డారో, వాళ్ళందర్నీ నొప్పించకండా అబద్దలాడతా అమృతం ఎంత మసులుకుందో గుర్తు చేసుకున్నాడు. పెళ్ళాం అమ్మాయి అన్నమాటల్లో అబద్ధం లేదనిపించింది. ''పేరుకి ఒట్టేసిందిగానీ చేసేవన్నీ చేసి తీరుతుందామనిషి, అసలాళ్ళకులం అలాంటిదిలే'' అనేసి ఆమధ్య ఆడారిసత్తిరాజు అన్న మాట గుర్తొచ్చింది. వెంటనే సైకిలేసుకుని రామచంద్రపురం బయల్దేరేడు.



తలుపులు తెరిచిన అమృతాన్ని అమాంతంగా కౌగిలించుకుని లోపలికి తీసుకుపోయేడు.

ఆరాత్రి ఒక కలొచ్చింది.

ఆ కలలో గొల్లలమామిడాడ నించొచ్చిన ముగ్గురు కుర్రోళ్ళు అమృతం పట్టిమంచం మీద బాసి పట్టేసుక్కూర్చుని మందు తాగుతా పేకాడుతున్నాడు. వాళ్ళ గ్లాసులు ఖాళీ అయిపోతుంటే మందు పోస్తుంది అమృతం. వాళ్ళల్లో ఓ కుర్రాడు అమాంతంగా అమృతం జబ్బ కొరికేడు.

మెలుకువొచ్చింది బుల్లియ్యకి. పక్కనే సన్నగా గురకెడ్తూ నిద్రోతుంది అమృతం. అమాంతంగా ఆ మనిషిని దగ్గరగా లాగేసుకున్న బుల్లియ్య నువ్వు నాకొక్కడికే సొంతం అన్నాడు మగతగా.

* * *

మర్నాటినించీ పగటిపూట గూడా అమృతం ఇంట్లోనే గడుపుతున్నాడు. ఎక్కడికెళ్తున్నా కూడా వస్తానంటున్నాడు. ఇదంతా ప్రేమతో కాదు. లోపల తిష్టేసుకుని కూర్చున్న అనుమానంతో.

''సంతలకెళ్ళి బిగినెస్సు జెయ్యకండా ఉంటే యెలాగండీ?''మెత్తగా మందలించేది అమృతం.

''అవన్నీ నీ తర్వాతే'' అనేవాడు బుల్లియ్య.

''మన నోట్లో ముద్దెలాగ దిగడం నేనిక్కడే ఉంటాను. అరిగిపోతానా కరిగిపోతానా ముందు బిగినెస్సు బాగా జూసి నాలుగురాళ్ళు యెనకేస్తే తర్వాత హాయిగా బతకొచ్చు మనం ఏవంటారు?'' అని బలవంతంగా సంతలకి తోలాల్సొస్తుంది బుల్లియ్యని.

అయిష్టంగా కదిలే బుల్లియ్య సందు దొరికితే చాలు అమృతం యింటి కొచ్చేస్తున్నాడు. ఎక్కడికెళ్ళినా ఆ మనిషిని అంటుకుపోతున్నాడు. మొదట్లో బానే ఉందిగానీ అతనెందుకలా చేస్తున్నాడో తెల్సేకా చాలా చిరాకు మొదలైంది అమృతంలో.

ఇంటికొచ్చిన పాలవాడి మీదా పూలవాడి మీదా అనుమానమే. అమృతాన్ని పలకరించిన ప్రతివాడి మీదా అనుమానమే.

వాళ్ళెళ్లేకా రకరకాల బేతాళ ప్రశ్నల్తో విసిగించేస్తున్నాడు. ఒక బతికి చెడ్డ ముసలోడికి వారానికోరోజు భోజనం పెట్టేది అమృతం చివరికా ముసలాడి మీదకూడా అనుమానం మొదలైంది. చిరాకేసిన అమృతం గొడవ పడింది. ''ఇలాగయితే నా వల్లగాదు బాబూ'' అనేసిందోరోజు.

ఇంకొన్నాళ్ళకి బుల్లియ్యతో వ్యాపారం జేసేవాళ్ళు అవసరాలున్నోళ్ళూ మాటాడే పనున్నవాళ్ళూ సరాసరి అమృతం ఇంటి కొచ్చేసేవారు.

* * *

అల్లుడు చెయ్యి జారిపోతున్నాడు ఆలశ్యం జేస్తే కూతురుకి మిగల్డు అని ఆలోచించుకున్న బుల్లియ్య అత్తమావలు ఒక మెల్త వేసేరు. అదేంటంటే మావిడాడలో ద్వారంపూడోళ్ళ కుర్రాడూ, మహేంద్రాడలో చిన్నమోరి కుర్రాడు గల్సి తునిలో ఫైనాన్స్‌కంపెనీ పెడ్తున్నారు. వాళ్ళు బుల్లియ్యమావగారికి చాలా దగ్గరి బంధువులు. వాళ్ళతో జతేసి బుల్లియ్యని పంపేసే ఏర్పాటు జేసేరు.

మావగారు జెప్తుంటే మొత్తం విన్న బుల్లియ్య 'నేనీ వూర్నించి కదల్నంటే కదల్ను' అనేసి రామచంద్రపురం వెళ్ళేక ఇదే వూసు అమృతం దగ్గర ఎత్తేడు.

దానికమృతం ఏవందంటే ''ఎంటనే ఒప్పేసుకోండి మంచి లాబదాయకం ఈ టైములో ఎనకేసుకుంటే ముందు ముందు బోల్డు సుకం మనకి'' అని ముందు ముందు ఎన్ని లాభాలున్నాయో చాలా వివరంగా చెప్పింది.

అమృతానికి దూరంగా వెళ్ళడం ఏమాత్రం సయించని బుల్లియ్య ''నిన్నొదిలి నేనుండలేనే'' అనేసేడు.

''వారానికో పాలి నేనొత్తుంటాను. మీరూ ఒద్దురుగానీ తుని మనకి దూరమా బారమా గంట గంటకీ బస్సులున్నాయి. రాంపురం నించి అయిదుగంటలు ప్రయాణం'' అలాగలాగ బులిపించి బుజ్జగించి ఒప్పించేసింది బుల్లియ్యని.

* * *

తునిలో ఫైనాన్స్ వ్యాపారం జేస్తున్నాడుగానీ మనసంతా అమృతం మీదే తెలివైన వాడేమో సగం మనసు పెట్టి వ్యాపారం చేస్తున్నా లాభాలు గట్టిగానే వస్తున్నాయి.

ప్రతిరోజూ అమృతానికి ఫోను జేసేవాడు. చేసే టైముకి ఎంగేజుగా ఉంటే ఏ లంజాకొడుకు తో మాటాడ్తుందో నైటు బుకింగ్ కాకినాడగానీ పోద్దేమో. ఇలాగిలాగ రకరకాలుగా ఊహించేసు కునేవాడు. ఒకసారి అర్ధరాత్రి జేసి అటుపక్క ఎత్తకపోతే పోయిందెవడితోనో అనేసి రకరకాలుగా ఆలోచించుకునేవాడు. మర్నాడు ఫోన్ చేసి ''రాత్రెక్కడి కెళ్ళేవ్ మొన్నా మధ్యా మావోడొకడు కాకినాడ వీసస్ లాడ్జి దగ్గర చూసేడట నిన్ను'' ఇలా ప్రాణాలు తీసేవాడు. ప్రతీ శనివారం నైటూ బయల్దేరి రామచంద్రపురం వచ్చేసి పెద్ద రాద్ధాంతం చేసేవాడు.

కొన్నాళ్ళు భరించిందిగానీ ఇక తన వల్లగాక ఇద్దరికీ మధ్యవర్తి అయిన పులగం పెద్దని పిల్చి ''ఆయన్తో నా వల్లకాదండి రెడ్డిగారూ తెగతెంపులు చేసేసుకుంటాం. తుని నించి రేపు దిగుతాడు. కొంచెం చెప్పెయ్యండి...మరీ ఇంత అనుమానమేంటామనిషికి'' అని బుల్లియ్య లీలలన్నీ దండ గుచ్చినట్టు చెప్పింది.

విన్న పులగం పెద్దకీ అమృతం చెప్పే దాంట్లో న్యాయముందనిపించింది.

''ఈ పనిమీద రేపు కలుద్దాం'' అన్నాడు.

దాంతో బుల్లియ్య గుండెలు జారిపోయినియ్యి.

''విడిపోడమా? నేను వెళ్లిపోతే అమృతం మంచం మీద మరొకడు ఊహించుకుంటుంటే జీర్ణమవడం లేదు''. మనసంతా పరిపరి విధాలుగా పోతుంది. ఇక్కడుంటే విడిపోడం ఖాయం అనుకుని ఎవరికీ చెప్పకుండా రాత్రి బస్సెక్కి తునెళ్ళిపోయేడు.

* * *

ఎండలు బండల్ని బద్దలు కొడ్తున్న రోజులు.

మోటార్సైకిలుమీద ఆ ఎండల్లోనే తిరుగుతున్నాడు వసూళ్ళకి. తిరుగుతున్నాడేగానీ ఎప్పుడూ అమృతం ధ్యాసే. ఈ టైములో అమృతం ఏం చేస్తుంటుంది. ఇంటికి ఎవరు వచ్చి ఉంటారు. వాళ్ళతో ఏం మాటాడ్తుంది. ఏం చేస్తుంది ఇలా.

రాత్రయింది.

ఫోన్ చేశాడు.

ఎంగేజ్ టోన్ విన్పించింది.

ఏం చేస్తుంది. ఇంతసేపూ ఎవడితో మాటాడ్తుంది. మనసంతా గజిబిజి అయి పోయింది. చాలాసేపయ్యాకా మళ్ళీ చేశాడు.

రింగవుతుంది. ఎవరూ తియ్యడం లేదు.

మళ్ళీ మళ్ళీ చేశాడు.

ఎవరూ ఎత్తడం లేదు.

అనుమానం మొదలైంది.

ఎవడి దగ్గరకో వెళ్ళిపోయి ఉండాలి. లేదా ఎవడైనా వస్తే టెలిఫోను ప్లెగ్గు తీసేసి ఉండాలి.

తెల్లవార్లూ అదే ఆలోచిస్తా కూర్చున్నాడు.

తెల్లవారు ఝామున వర్షం మొదలైంది.

అనుకోకుండా చాలా మార్పొచ్చేసింది వాతావరణంలో. దాంతో జొరమొచ్చేసింది బుల్లియ్యకి.

సాయంత్రానికి మరీ పెరిగిపోయింది. ఆ జ్వరం. అంత జ్వరంలోనూ అమృతం గురించే ఆలోచిస్తున్నాడు.

ఇక్కడ వర్షంగా ఉంది. ఈ ఊరికి ఆ ఊరు పెద్ద దూరం కాదు. కాబట్టి అక్కడా వర్షం పడుతూ ఉండొచ్చు. వర్షమంటే అమృతానికిష్టం. కిటికీ ఊచల్లోంచి వర్షాన్ని చూస్తూ వేడిగా తినాలి అన్పిస్తుంది అని చాలాసార్లు అంది అమృతం. తాగాలి అనికూడా అంది. నీ వేడి శరీరం పేనంలా కాలిపోయే నా శరీరాన్ని తాకాలి అని కూడా అంది. ఈ వర్షంలో నేనిక్కడున్నాను. తనక్కడుంది. తను లేకపోతే ఇంకోడు కాదా? కాదు. కాదు... కాదు..అవును. అయితే మగాడెవడు? ఎవడంటే ఎంతమందితో ఎన్ని పరిచయాలు అమృతానికి. ఎన్నిసార్లు ఫోన్ చేస్తే ఎంగేజ్‌సౌండ్ రాలేదు. ఎవడో తనకి నచ్చిన వాడ్ని పిలుస్తుంది ఫోన్లో.

ఈదురుగాలికి ధనాల్మని తెరుచుకుంది తలుపురెక్క.

గాలితో పాటే లోపలికొచ్చేడు దోసకాయలపల్లి చౌదరి. వచ్చీరావడంతోటే తడిసిపోయిన బట్టలు విప్పి పిండుకోకుండా అమృతం నడుం పట్టేసుకున్నాడు. కాలిపోతున్న ఆ మనిషికంఠం కింద ముద్దెట్టుకున్నాడు. ఆమె చాతికి తన చాతీ ఆన్చేడు. నోట్లో నోరు పెట్టేడు.

అప్పుడు పుట్టిన వేడికీ ఆ వేడిలోంచి పుట్టిన సెగకీ తడిసిముద్దయిపోయిన దోసకాయలపల్లి చౌదరి తడిబట్టలు పొడిబట్టలయిపోయినియ్యి. వాళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్ళు కలేసుకుంటున్నారు. తాచు పాముల్లాగమెలేసుకుంటున్నారు. సరిగ్గా అదే టైములో వీధి చివర కరెంటు తీగల మధ్య నిప్పు పుట్టి కాలిపోయినియ్యి. కరెంటు పోయి కటిక చీకటైపోయి. అమృతాన్ని మంచం మీదికి జేర్చిన చౌదరి ఆమె మీద ఒబ్బిడిగా పడుకున్నాడు.

ఆ తర్వాత ———

ఊహించుకుంటా ఎక్కడికో ఎక్కడెక్కడికో వెళ్ళిపోయిన బుల్లియ్య అల్పమైన గుండెకాయ కోడికూసే వేళప్పుడు గామోసు అమాంతంగా ఆగిపోయింది.

* * *